31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

ఆదివారం,అక్టోబర్ 11 , 2026 | పేజీలు : 8

## దుర్గా నవరాత్రి, దసరాకు పటిష్ట భద్రత



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 10:** దుర్గా నవరాత్రి ఉత్సవాలు, విజయ దశమి పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో దుర్గా దేవి మండపాలు, దేవాలయాలు, రావణ దహన ప్రదేశాలు, ప్రజలు అధికంగా గుమిగూడే ప్రాంతాల వద్ద పోలీస్ బందో బస్తు ఏర్పాటు చేస్తామని, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంటుందని పేర్కొన్నారు. మండప నిర్వాహకులు పోలీసు శాఖ రూపొందించిన పోలీసు పోర్టల్.టిఎస్ పోలీస్ .జిఓవి.ఇన్. పోర్టల్ ద్వారా వివరాలు నమోదు చేసు కుని సహకరించాలని కోరారు. మండ పాలను ప్రజా రవాణాకు, ఎమర్జెన్సీ వాహనాలకు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలని, పూర్తి బాధ్యత నిర్వాహ కులదేనని, తప్పనిసరిగా సీసీ కెమెరాలు, ఫైర్ ఎక్స్టింగ్విషర్లు, నీరు, ఇసుక ఏర్పాటు -మిగతా 2లో

# తీరొక్క పూలతో

# బతుకమ్మ సంబురం!







- బతుకమ్మ వేడుకలతో మహిళ,చిన్నారుల్లో సందడి
- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా పూల పండుగ

చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం : అక్టోబర్ (10 )

ప్రపంచంలో తీరొక్క పూలతో పండుగ జరుపుకునే విశిష్ట సంప్రదాయం తెలంగాణ బతుకమ్మ పండుగకే సొంతం. ప్రకృతి, సంస్కృతి, సంప్రదాయాల కలయికగా నిలిచే బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయ వేడుకగా ప్రసిద్ధి చెందింది. రంగురంగుల పూలను అందంగా దొంతరలుగా పేర్చి గౌరమ్మను ప్రతిష్ఠించి, బతుకమ్మ చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ ఆడిపాడే ఈ పండుగకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక స్థానం ఉంది. నేటి నుంచి బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభం కానుండటంతో ఇబ్రహీంపట్నం మండలంలోని గ్రామాల్లో మహిళలు, చిన్నారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

-మిగతా 2లో

### రైతులు ప్రత్యామ్నాయ పంటల

## సాగుపై దృష్టి సారించాలి



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 10:** రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని, తాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ వాతావరణ నిపుణుల అంచనాల ప్రకారం ఎల్నినో పరిస్థితులు క్రమంగా బలపడే అవకాశం ఉన్నందున రానున్న రోజుల్లో వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 12 శాతం లోటు వర్షపాతం నమోదవుతోందని, భవిష్యత్తులో ఈ లోటు మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో సాగునీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున తాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలో ప్రస్తుతం కోటి 16 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయని మంత్రి తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే వరి సాగు విస్తీర్ణం కేవలం 1.20 లక్షల ఎకరాలు మాత్రమే తగ్గిందన్నారు. ప్రత్యామ్నాయ పంటలను 33 లక్షల ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా నిర్దేశించినప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించలేకపోయామని పేర్కొన్నారు. ఇంకా 49 లక్షల ఎకరాల్లో వరి సాగు జరగడం ప్రస్తుత పరిస్థితుల్లో ఆందోళనకరమని, -మిగతా 2లో

### ప్రధాని మోదీ నిరంకుశ ధోరణిని

## తీవ్రంగా ఖండిస్తున్నాం

**మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 10:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలన 1975 నాటి ఎమర్జెన్సీని తలపిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. జీవన్ రెడ్డి విమర్శించారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ అనాటి ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించి, ప్రజాస్వామ్య హక్కులను హరించడంతో పాటు భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేసిన చీకటి రోజులు ప్రస్తుత ప్రధాని మోదీ పాలనలో మరోసారి గుర్తుకొస్తున్నాయని పేర్కొన్నారు. ప్రధాని మోదీ తరచూ ప్రజాస్వామ్య విలువలు, హక్కుల గురించి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య హక్కులపై ఆంక్షలు, ఎస్ఐఆర్ పేరిట ఓటు హక్కుపై భారత ఎన్నికల సంఘం వ్యవహార శైలి, ప్రజాస్వామ్య పరిరక్షణపై అనుమానాలు రేకెత్తిస్తోందని అన్నారు. ప్రజాస్వామ్యబద్ధమైన శాంతియుత నిరసనలను అణచివేయడం, ప్రశ్నించే గొంతుకలపై ఆంక్షలు విధించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. సీజెపి నిర్వహింప తలపెట్టిన ర్యాలీకి ఆటంకాలు కలిగించడం, ఇంటర్నెట్, మొబైల్ సేవలను నిలిపివేయడంతో పాటు, దేశ రాజధాని ఢిల్లీ పట్టణాన్ని కార్డన్ తో నిర్బంధించి, ఢిల్లీకి వచ్చే రైళ్ల రాకపోకలను సైతం నిలిపివేయడం ఎమర్జెన్సీ, నిరంకుశ విధానాలను తలపిస్తున్నాయని ఆరోపించారు. బీజేపీ నేతృత్వంలోని ప్రధాని మోదీ ప్రభుత్వ నిరంకుశ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నా మని, భారత రాజ్యాంగం దేశ పౌరు లకు ప్రసాదించిన హక్కులను పరిరక్షిం చు కునేందుకు ప్రజాస్వామ్యవాదు లందరూ రాజకీయాలకు అతీతంగా ఖండించి, ప్రజాస్వామ్య ప్రక్రియ కొనసాగింపునకు పాటుపడాలన్నారు.

## ప్రజా సేవే ముఖ్యం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ అక్టోబర్ 10 :** ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయడమే తమకు ముఖ్యమని లొంక కేసారం మాజీ సర్పంచ్ ఎండి మంజూర్ అన్నారు. ఈ మేరకు శనివారం రామగిరి మండలం లొంక కేసారం గ్రామ ప్రజలకు బతుకమ్మ సందర్భంగా 35 వేల రూపాయల విలువ గల మ్యూజిక్ సిస్టం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు బతుకమ్మలు ఆడేందుకు గాను వారి కోరిక మేరకు మేజిక్ సిస్టం అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. తాను ఎప్పటికైనా తనను కన్న గ్రామం లొంక కేసారం గ్రామాన్ని మరువనని అలాగే తమను ఆదరించిన ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజాహిత కార్యక్రమాల్లో పాల్గొంటానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ సర్పంచ్ మంజూరుకు ధన్యవాదాలు తెలిపారు.

## పాక్స్ చైర్మన్‌ను సన్మానించిన రామగుండం డీసీపీ రాంరెడ్డి



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 10 :** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం కేంద్ర పాక్స్ చైర్మన్ చేపూరి గంగాధర్ ని రామగుండం డిసిపి భూక్యా రాంరెడ్డి సన్మానించారు. శనివారం పాక్స్ చైర్మన్ గంగాధర్ తోపాటు నూతన డైరెక్టర్ లను కూడా సన్మానించారు. రామగుండం కమిషనరేట్ పెద్దపల్లి జిల్లా డీసీపీ రాంరెడ్డి, చేపూరి గంగాధర్ చిన్ననాటి స్నేహితులు వారి స్వగ్రామం వచ్చినప్పుడు గంగాధర్ ని కలుస్తాడని అంటున్నారు.

## రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపిక



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ అక్టోబర్ 10 :** పాలకుర్తి మండలం ఘన్పూదాస్ నగర్ లోని యూనివర్సల్ పాఠశాల విద్యార్థులు నెట్బాల్ పోటీలకు ఎంపికయ్యారు. నెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ లోని రైసింగ్ సన్ స్కూల్ నిర్వహించిన నెట్ బాల్ సెలక్షన్స్ లలో యూనివర్సల్ స్కూల్ విద్యార్థులు ఎస్.రుచిత, అంత్ర చౌరస్య, ఆస్రా సింగ్ లు ఎంపికై ఈ నెల 11, 12 తేదీలలో ఆసిఫాబాద్ తెలంగాణ మోడల్ స్కూల్ లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటున్నట్టు వ్యాయామ ఉపాధ్యాయుడు కల్వల సంతోష్ తెలిపారు.. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మొహమ్మద్ ఇస్మాయిల్, ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ అఫ్జల్ విద్యార్థులని అభినందించారు.

# తీరొక్క పూలతో బతుకమ్మ సంబురం...!

చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం : అక్టోబర్ (10 )

**తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే పండుగ...**

బతుకమ్మ అంటేనే తెలంగాణ.. తెలంగాణ అంటేనే బతుకమ్మ అనే విధంగా ఈ పండుగ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది. ప్రకృతిలో సహజంగా లభించే గునుగు, తంగేడు, బంతి, చామంతి తదితర పూలతో బతుకమ్మలను పేర్చి పూజించడం ఈ పండుగ ప్రత్యేకత. ప్రకృతిని ఆరాధిస్తూ పూలకు పూజలు చేసే ఈ సంప్రదాయం పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను కూడా చాటిచెబుతుంది. బతుకమ్మ పండుగ కేవలం మతపరమైన వేడుక మాత్రమే కాదు.. కుటుంబ బంధాలను బలోపేతం చేసే సామాజిక ఉత్సవం కూడా. వివిధ కులాలు, వర్గాలు, ప్రాంతాలకు చెందిన మహిళలు ఒక్కచోట చేరి సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొంటారు. వివాహమైన ఆడబిడ్డలను పుట్టింటికి ఆహ్వానించి కుటుంబ సభ్యులతో కలిసి పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

**తొమ్మిది రోజులపాటు ప్రత్యేక వేడుకలు...**

బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా తొమ్మిది రోజులపాటు నిర్వహిస్తారు. ఒక్కో రోజుకు ఒక్కో ప్రత్యేకత ఉండటంతో పాటు ప్రత్యేకమైన బతుకమ్మను పేర్చి, ఆయా రోజులకు అనుగుణంగా నైవేద్యాలు సమర్పిస్తారు. ఆశ్వయుజ మాసంలో నిర్వహించే ఈ ఉత్సవాలు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి.

**మొదటి రోజు -- ఎంగిలిపూల బతుకమ్మ:** వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి పూజలు చేస్తారు. సంప్రదాయం ప్రకారం ప్రత్యేక నైవేద్యాలు సమర్పిస్తారు.

**రెండో రోజు -- అటుకుల బతుకమ్మ:** అటుకులు, బెల్లం, చప్పిడి పప్పు తదితర పదార్థాలను నైవేద్యంగా సమర్పిస్తారు.

**మూడో రోజు -- ముద్దపప్పు బతుకమ్మ:** ముద్దపప్పు, పాలు, బెల్లంతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి పూజలు నిర్వహిస్తారు.

**నాలుగో రోజు -- నానబియ్యం బతుకమ్మ:** నానబెట్టిన బియ్యం, పాలు, బెల్లం తదితర పదార్థాలను నైవేద్యంగా పెడతారు.

**ఐదో రోజు -- అట్ల బతుకమ్మ:** అట్లు తయారు చేసి అమ్మవారికి సమర్పిస్తారు.

**ఆరో రోజు -- అలిగిన బతుకమ్మ:** సంప్రదాయం ప్రకారం ఈ రోజు బతుకమ్మకు నైవేద్యం సమర్పించరు.

**ఏడో రోజు -- వేపకాయల బతుకమ్మ:** సకినాల పిండితో వేపకాయల ఆకారంలో వంటకాలు తయారు చేసి నైవేద్యంగా పెడతారు.

**ఎనిమిదో రోజు -- వెన్నముద్దల బతుకమ్మ:** నువ్వులు, వెన్నముద్ద, బెల్లం తదితర పదార్థాలతో నైవేద్యం సమర్పిస్తారు.

**తొమ్మిదో రోజు -- సద్దుల బతుకమ్మ:** అత్యంత వైభవంగా నిర్వహించే ఈ వేడుకతో బతుకమ్మ ఉత్సవాలు ముగుస్తాయి. వివిధ రకాల అన్నం ప్రసాదాలను తయారు చేసి అమ్మవారికి సమర్పిస్తారు.

**చెరువులు, జలాశయాల వద్ద నిమజ్జనం....**

సద్దుల బతుకమ్మ రోజున మహిళలు పెద్ద బతుకమ్మలను పేర్చి సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబై గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్దకు చేరుకుంటారు. బతుకమ్మ చుట్టూ వలయాకారంలో తిరుగుతూ జానపద పాటలు పాడి సందడి చేస్తారు. అనంతరం బతుకమ్మలను తలపై పెట్టుకొని ఊరేగింపుగా చెరువులు, కుంటలు, ఇతర జలాశయాల వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేస్తారు. అనంతరం ప్రసాదాలను పరస్పరం పంచుకుంటూ సంతోషంగా వేడుకలను ముగిస్తారు.

## రైతులు ప్రత్యామ్నాయ పంటల

# సాగుపై దృష్టి సారించాలి

**మొదటి పేజీ తరువాయి.....** ఆగస్టు 7 తర్వాత కూడా మరో 10 లక్షల ఎకరాల్లో వరి సాగు విస్తరించిందని మంత్రి వివరించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల సాగులో తగిన మార్పులు చేసుకోవాలని మంత్రి సూచించారు. భూములను ఖాళీగా ఉంచకుండా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని కోరారు. నీటి వినియోగాన్ని తగ్గిస్తూ వ్యవసాయాన్ని కొనసాగించేలా రైతులకు అవగాహన కల్పించాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. రానున్న రోజుల్లో వర్షపాతం తగ్గే అవకాశాలను దృష్టిలో పెట్టుకుని రైతులు ముందస్తు ప్రణాళికతో పంటలు సాగు చేయాలని, నీటి లభ్యతకు అనుగుణంగా తక్కువ నీటి అవసరమున్న పంటలకు ప్రాధాన్యతనిస్తూ వ్యవసాయం చేపట్టాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రైతులను కోరారు. ఈ సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్, డిసిసి అధ్యక్షులు గాజెంగి నందయ్య, జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమీంద్ర వాణి శ్రీనివాస్, మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కును

# కాలరాసే చర్యలను నిలిపివేయాలి

**చురకలు ప్రతినిధి కోరుట్ల, అక్టోబర్ 10 :** ఓటర్ల జాబితా నుంచి ఓట్ల తొలగింపును నిలిపివేయాలని, ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల ఐక్య కమిటీ ఆధ్వర్యంలో శనివారం జగిత్యాల డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ సమీప అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఓటర్ల జాబితా నుంచి ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్‌లో అమలవుతున్న విధానాలపై న్యాయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషనర్ల నియామకంలో గతంలో అనుసరించిన పద్ధతిని పునరుద్ధరించి ప్రజాస్వామ్యాన్ని



కాపాడాలని కోరారు. అలాగే ఢిల్లీలో అరెస్టు చేసినట్టు పేర్కొన్న సీజేఐ అభిజిత్, దీప్తి, సౌరత్ దాస్, అసుతోష్ యాంకర్ ర్యాంకాలను వెంటనే విడుదల చేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, సీపీఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, కార్మిక సంఘాల జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు, కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, ప్రజాసంఘాల నాయకులు ఇలియాస్ ఖాన్, మహమ్మద్ ముజీబ్, అంజద్ ఖాన్, రియాజ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు ఎం.డి. సమీర్, అందె వంశీకృష్ణ, కొక్కుల గంగాధర్ పాల్గొన్నారు.

## దుర్గా నవరాత్రి, దసరాకు పటిష్ట భద్రత

**మొదటి పేజీ తరువాయి....** చేసుకోవాలని సూచించారు. 24 గంటలు నలుగురు వాలంటీర్లు ఉండాల ని, క్యూలైన్లు ఏర్పాటు చేయాలని, డీజేలు ఏర్పాటు చేయరాదని తెలిపారు. అను మానాస్పద వస్తువులు కనిపిస్తే డయల్ 112కు సమాచారం ఇవ్వాలని, మహిళలు, పిల్లలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## నిరుపేదలకు ఉచిత కంటి ఆపరేషన్లు



**చురకలు విలేకరి,జగిత్యాల,అక్టోబర్ 10 :** జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కు చెందిన పావని కంటి ఆసుపత్రిలో ఆపి, రోటరీ క్లబ్ జగిత్యాల ఆధ్వర్యంలో శనివారం జగిత్యాల నియోజకవర్గానికి చెందిన 12 మంది నిరుపేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పాల్గొని, ఆపరేషన్లు చేయించుకున్న వారికి ఉచితంగా కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కనకదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో దశమ వర్ష

**-దుర్గశరన్నవరాత్రోత్సవాలకు ఏర్పాట్లకు ముస్తాబయిన మండపం**



**చురకలు విలేకరి, జగిత్యాల,అక్టోబర్ 10 :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని అష్టలక్ష్మి దేవాలయ ఆవరణలో కనక దుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో దశమ వర్ష దుర్గ శరన్నవరాత్రి ఉత్సవాలలో భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. నేడు ఆదివారం ఉదయం 8 గంటలకు అంగరంగ వైభవంగా ఊరేగింపుగా బైపాస్ దేవిశ్రీ గార్డెన్ నుండి ప్రారంభమై పుర విధులు గుండా జంబిగద్దె ,అంబేడ్కర్ సర్కిల్, టవర్ సర్కిల్, రాంబజార్, కృష్ణా నగర్ , అష్టలక్ష్మి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అమ్మవారు మండపానికి చేరుతుంది. గత 9 సంవత్సరాల నుండి ఆలయంలో అమ్మవారిని సంపూర్ణాంగా మట్టితో తయారు చేసిన అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి అమ్మవారి మహా కలశ స్థాపన, దీక్షలు అంకురార్పణతో మొదలై ప్రతిరోజు ఒకరూపంతో,అలంకరణ తో అమ్మవారు దర్శనం ఇవ్వనున్నట్లు కనకదుర్గ సేవా సమితి నిర్వాహకులు తెలిపారు.

## సేవా కార్యక్రమాలు అభినందనీయం



**చురకలు విలేకరి, ధర్మపురి,అక్టోబర్ 10 :** ధర్మపురి పట్టణంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రం గోదావరి నది ప్రాంతంలో అమావాస్యను పురస్కరించుకొని అమావాస్య అన్నప్రసాద సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి ప్రారంభించారు.ప్రతి అమావాస్య రోజున మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు, స్థానిక ప్రజలు ఈ అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు. భక్తులకు అన్నప్రసాదం అందించడం ద్వారా సేవాభావాన్ని చాటుకుంటున్న నిర్వాహకులను చైర్ పర్సన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ,మండల అధ్యక్షులు పిన్న శ్రీనివాస్, సాయిని శ్రీనివాస్, సేవ సమితి సభ్యులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

# శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం

**-గ్రామాల్లో ఏర్పాటైన అమ్మవారి మండపాలు**
**-నేటి నుంచి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు**
**-అమ్మవారి భవానీ దీక్ష స్వీకరణకు సిద్ధమవుతున్న భక్తులు**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం అక్టోబర్ (10) :** ఆశ్వయుజ మాసం శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని గ్రామాలు ముస్తాబయ్యాయి. గోదూరు, తిమ్మాపూర్, యామాపూర్, ఫకీర్ కొండాపూర్, వేములకుర్తి,బర్దిపూర్, ములరాంపూర్, ఎర్దండి, కోమటికొండాపూర్, వర్షకొండ, ఇబ్రహీంపట్నం, అమ్మక్కపేట, డబ్బా, కేశాపూర్, కోజన్ కొత్తూరు ,ఇబ్రహింపట్నం ,వర్షకోండ, కోమటికోండాపుర్ గ్రామాల్లో దేవి శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యుల.ఆధ్వర్యంలో అమ్మవారి పూజా మండపాలను ఏర్పాటు చేశారు. అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, హోమాలు నిర్వహించనున్నారు. భవానీ దీక్షలు స్వీకరించి నియమనిష్ఠలతో పూజల్లో పాల్గొనేందుకు భక్తులు సిద్ధమవుతున్నారు. భక్తులకు ఎలాంటి ఇక్కట్లు జరగకుండా ఉండేందుకు కూర్చో కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

**రోజువారీ కార్యక్రమాల వివరాలు...**

శరన్నవరాత్రుల్లో అమ్మవారిని రోజుకో రూపంలో అలంకరించి పూజించడం ఆనవాయితీ. విజయవాడ ఇంద్రకీలాద్రిపై నిర్వహించే సంప్రదాయాన్ని అనుసరించి సాధారణంగా పాటించే అమ్మవారి అలంకరణల క్రమం ఇలా ఉంటుంది.

అక్టోబర్ 11, ఆదివారం: శ్రీ బాలా త్రిపురసుందరీ దేవి,అక్టోబర్ 12, సోమవారం: శ్రీ గాయత్రీ దేవి,అక్టోబర్ 13, మంగళవారం: శ్రీ అన్నపూర్ణ దేవి,అక్టోబర్ 14, బుధవారం: శ్రీ మహాలక్ష్మీ దేవి,అక్టోబర్ 15, గురువారం: శ్రీ లలితా త్రిపురసుందరీ దేవి,అక్టోబర్ 16, శుక్రవారం: శ్రీ సరస్వతీ దేవి,అక్టోబర్ 17, శనివారం: శ్రీ దుర్గాదేవి,అక్టోబర్ 18, ఆదివారం: శ్రీ మహిషాసురమర్దిని దేవి,అక్టోబర్ 19, సోమవారం: శ్రీ రాజరాజేశ్వరీ దేవి,అక్టోబర్ 20, మంగళవారం విజయదశమి సందర్భంగా ఆలయ సంప్రదాయాన్ని బట్టి ప్రత్యేక పూజలు, అమ్మవారి ఊరేగింపు లేదా ఇతర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. స్థానిక ఉత్సవ కమిటీలు, అర్చకులు ఖరారు చేసిన కార్యక్రమాల ప్రకారం అలంకరణలు, పూజా సమయాల్లో మార్పులు ఉండవచ్చు.

**2001లో ప్రారంభమైన అమ్మవారి ఉత్సవాలు**

**అంకతి విజయ్ కుమార్ - ఉత్సవ కమిటీ వ్యవస్థాపకులు**

వేములకుర్తి గ్రామంలో 2001లో ఐదుగురం కలిసి గ్రామస్తులు, దాతల సహకారంతో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించాం. అప్పటి నుంచి ప్రతి ఏడాది గ్రామ యువకులు అమ్మవారి దీక్షలు స్వీకరించి తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. ఉత్సవాలు ఆడంబరంగా జరుగుతున్నాయి.

**అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఆరాధించాలి**

**రొట్టె కిషన్ శర్మ - అర్చకులు కోజన్ కొత్తూరు**

శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాల్లో అలంకరించి పూజిస్తారు. భక్తులు నియమనిష్ఠలతో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయాలి. ఆశ్వయుజ మాసంలో అమ్మవారిని ఆరాధించడం శుభప్రదమని విశ్వాసం భక్తుల్లో ఉంది.

**దాతల సహకారంతో ఉత్సవాల నిర్వహణ**

**దోనికెన మహేందర్ - భజరంగ్ దళ్ యువసేన**

వేములకుర్తి గ్రామంలో ప్రతి ఏడాది దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నాం. గ్రామస్తులు, దాతల సహకారంతో మండపాన్ని ఏర్పాటు చేశాము . భవానీ దీక్షలు స్వీకరించే భక్తుల కోసం అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాము, తొమ్మిది రోజుల పాటు అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకునేలా ఏర్పాట్లు పూర్తి చేశాం.

## విజయదశమి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

**-ముస్తాబైన వెంకటేశ్వర స్వామి ఆలయాలు**
**-నేటి నుంచి స్వామి వారి పల్లకి సేవలు**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం అక్టోబర్ (10) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని గోదూర్, తిమ్మాపూర్, యామాపూర్, వేములకుర్తి, వర్షకొండ, ఇబ్రహీంపట్నం గ్రామాల్లో శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి విజయదశమి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయా గ్రామాల్లోని వెంకటేశ్వర స్వామి ఆలయాలను ముస్తాబు చేశారు.బ్రహ్మోత్సవాల్లో భాగంగా అదివారం మెదలు విజయదశమి వరకు తొమ్మిది రోజుల పాటు స్వామివారి పల్లకి సేవ (శావ సేవ) నిర్వహించనున్నారు.ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో స్వామివారి పల్లకి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేపట్టారు. స్వామివారి గ్రామ ప్రదక్షిణకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. విజయదశమి వరకు జరిగే ఈ ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించు కోనున్నారు.భక్తిశ్రద్ధలతో జరిగే పల్లకి సేవలు, ప్రత్యేక పూజలతో ఆయా గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొననుంది.ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.



## శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి చివరి తడికి నీటిని విడుదల చేయాలి

**-మంత్రిఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరిన జువ్వాడి నర్సింగరావు**



**చురకలు ప్రతినిధి కోరుట్ల,అక్టోబర్ 10 :** కోరుట్ల నియోజకవర్గంలో చివరి తడికి సాగునీరు అందక పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి 10 టీఎంసీల నీటిని విడుదల చేసి రైతులకు చివరి తడికి నీరు అందించాలని రాష్ట్ర భారీ, మధ్యతరహా నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు కోరారు.నియోజకవర్గంలోని రైతులు తమ పంటలకు చివరి తడి అందకపోవడంతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను జువ్వాడి నర్సింగరావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఈ సమస్యను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి 10 టీఎంసీల నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు జువ్వాడి నర్సింగరావు తెలిపారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో సాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న రైతుల పంటలను కాపాడాలనే ఉద్దేశంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి శనివారం నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. పంటలు చేతికి వచ్చే వరకు రైతులకు సాగునీరు అందించేందుకు తమ ప్రయత్నాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, పంటలను కాపాడేందుకు అవసరమైన చర్యల కోసం కృషి చేస్తామని జువ్వాడి నర్సింగరావు భరోసా ఇచ్చారు.

## ఎం.ఏ.నయీమ్‌కు ఘన సన్మానం



చురకలు ప్రతినిధి కోరుట్ల, అక్టోబర్ 10 : జగిత్యాల జిల్లా మైనారిటీ చైర్మన్‌గా నియమితులైన ఎం.ఏ. నయీమ్‌ను ఏ.టి. కన్స్ట్రక్షన్స్ చైర్మన్ ఎం.ఏ. వాజిద్, 8వ వార్డు కౌన్సిలర్ తోట గంగాధర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్వీట్లు తినిపించి, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎం.ఏ. వాజిద్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీలకు ప్రాధాన్యతనిస్తూ వారికి సముచిత గుర్తింపు కల్పిస్తోందన్నారు. జగిత్యాల జిల్లా మైనారిటీ చైర్మన్‌గా నియమితులైన ఎం.ఏ. నయీమ్ జిల్లా మైనారిటీ ప్రజల సంక్షేమానికి కృషి చేయాలని, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని కోరారు. మైనారిటీల అభ్యున్నతికి కృషి చేయాలని ఆకాంక్షిస్తూ నయీమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## ఏఐటీయూసీ పోరాటాల ఫలితంగానే అంగన్‌వాడీలకు దసరా సెలవులు

**-ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్కకు ప్రత్యేక కృతజ్ఞతలు**





చురకలు ప్రతినిధి కోరుట్ల, అక్టోబర్ 10 : తెలంగాణ రాష్ట్రంలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు దసరా సెలవులు మంజూరు చేస్తూ మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేయడంపై ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం. సాయి ఈశ్వరి హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు దసరా సెలవులు మంజూరు చేయాలని ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ యూనియన్ నిరంతరం చేసిన పోరాటాలు, విజ్ఞప్తులు, ఉద్యమాల ఫలితంగానే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని సాయి ఈశ్వరి పేర్కొన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ ఎప్పటికప్పుడు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తూ, వారి హక్కుల సాధనకు కృషి చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 2026 అక్టోబర్ 10 నుంచి అక్టోబర్ 21 వరకు మొత్తం 12 రోజుల పాటు దసరా సెలవులు మంజూరు చేసినట్లు ఆమె వివరించారు. ఈ సెలవుల సమయంలో లబ్ధిదారులకు వేడి వంట భోజనానికి బదులుగా టేక్ హోమ్ రేషన్ అందించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిపారు. అక్టోబర్ 22 నుంచి అంగన్‌వాడీ కేంద్రాలు యథావిధిగా తిరిగి పనిచేయనున్నాయని పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం స్వాగతించదగినదని సాయి ఈశ్వరి అన్నారు. ఉద్యోగులకు సంబంధించిన ఇతర పెండింగ్ సమస్యలను కూడా ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలని కోరారు. అంగన్‌వాడీ ఉద్యోగుల హక్కుల సాధన కోసం యూనియన్ తన పోరాటాలను కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఎం. సాయి ఈశ్వరి రాష్ట్ర అధ్యక్షురాలుఏఐటీయూసీ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

## అంబులెన్స్ వచ్చే విధంగా రోడ్డు నిర్మాణం చేపట్టాలి



చురకలు విలేకరి, ధర్మపురి,అక్టోబర్ 10 : ధర్మపురి పట్టణంలో 12వ వార్డు, 13వ వార్డులో జరుగుతున్న రోడ్డు నిర్మాణం లో భాగంగా వాడలోకి అంబులెన్స్,ట్రాక్టర్లు వచ్చే విధంగా అడ్డంగా ఉన్న మెట్లను గద్దెలను తొలగించి నిర్మాణాలు చేపట్టాలని కోరుతూ 12,13వవార్డు ప్రజలు శనివారం ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ప్రజలందరికీ వినియోపడే రోడ్డును భవిష్యత్తు దృశ్య వెడల్పుగా నిర్మించాలని వారు వినతిపత్రంలో కోరారు.

# మొక్కల కొనుగోళ్లపై విచారణ జరపాలి



**-రూ.2.20 కోట్ల బయోమైనింగ్ పనుల్లోనూ అవకతవకల అనుమానాలు**
**-బిల్లుల చెల్లింపులు నిలిపివేయాలి**
**-మాజీ కౌన్సిలర్ అనుమల్ల జయశ్రీ డిమాండ్**

చురకలు విలేకరి,జగిత్యాల, అక్టోబర్ 10 : జగిత్యాల మున్సిపాలిటీ లో వనమహోత్సవం పేరుతో మొక్కల కొనుగోళ్లు, గ్రీన్ బడ్జెట్ నిర్వహణతో పాటు బయోమైనింగ్ పనుల్లోనూ అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని మాజీ వార్డు కౌన్సిలర్ అనుమల్ల జయశ్రీ డిమాండ్ చేశారు.ప్రజాధనం దుర్వినియోగం కాకుండా సంబంధిత రికార్డులను పరిశీలించి, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. విచారణ పూర్తయ్యే వరకు మొక్కల కొనుగోళ్లకు సంబంధించిన బిల్లుల చెల్లింపులను నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. వనమహోత్సవంలో భాగంగా లక్ష మొక్కల కొనుగోలుకు ఈ ఏడాది జూలై 24న టెండర్ పిలిచారని జయశ్రీ పేర్కొన్నారు. టెండర్‌కు ముందు మున్సిపల్ అధికారులు టీవీసీ నర్సరీ అండ్ అగ్రి బిజినెస్ సెంటర్ నుంచి కొటేషన్ తీసుకున్నారని, టెండర్‌లో ఆ సంస్థ ఒక్కటే పాల్గొని 1.2 శాతం తక్కువ ధరకు పనులు దక్కించుకుందని తెలిపారు. పోటీ లేకుండా ఒకే సంస్థకు టెండర్ ఎలా దక్కిందనే అంశంపై విచారణ జరపాలని కోరారు. జగిత్యాల పట్టణంలో సుమారు 25 వేల నివాస, వాణిజ్య భవనాలు ఉన్నాయని, వీటిలో దుకాణాలు, ఆసుపత్రులు, పాఠశాలలు తదితర సముదాయాలు కూడా ఉన్నందున లక్ష మొక్కల అవసరం, పంపిణీ ప్రణాళికపై స్పష్టత ఇవ్వాలని అన్నారు. వర్షాకాలం ముగిసే సమయంలో అక్టోబర్‌లో మొక్కల పంపిణీ చేపట్టడం, వాటి సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై అధికారులు వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. గతంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని ఐదు నర్సరీల్లో వేలాది మొక్కలను పెంచినట్లు రికార్డుల్లో ఖర్చులు చూపించారని జయశ్రీ తెలిపారు. గత రెండేళ్లుగా మొక్కల పెంపకం, పంపిణీ సక్రమంగా జరగలేదని ఆరోపించారు. నర్సరీల్లో మిగిలి ఉన్న పాత మొక్కలను ప్రస్తుత కొనుగోళ్లలో భాగంగా చూపించి, సుమారు రూ.13 లక్షల మేర బిల్లులు పొందేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్న సమాచారం తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు.లక్ష మొక్కల కొనుగోలుకు టెండర్ ఉండగా, కొత్తగా సుమారు 20 వేల మొక్కలే తెప్పించి, మిగిలిన మొక్కలను పాత నర్సరీల నుంచి తీసుకొచ్చి పంపిణీ చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. ఈ అంశంపై మున్సిపల్ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారుల వివరణలు, కొనుగోలు రికార్డులు, మొక్కల సరఫరా వివరాలను పరిశీలించాలని కోరారు. హరితహారం, వనమహోత్సవం కార్యక్రమాల్లో భాగంగా మొక్కల సంరక్షణ కోసం ప్రతి సంవత్సరం సుమారు రూ.50 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు లెక్కల్లో చూపుతున్నారని జయశ్రీ ఆరోపించారు. పట్టణంలో మొక్కల సంరక్షణకు కొనుగోలు చేసిన కుండీలను వినియోగించకుండా వదిలేశారని, కొన్ని చోట్ల అవి పగిలిపోయి కనిపిస్తున్నాయని తెలిపారు. కుండీల్లో మట్టి నింపి మొక్కలు నాటిన దాఖలాలు లేవని ఆరోపించారు. మొక్కల నిర్వహణకు అవసరమైన పరికరాల కొనుగోళ్లు, నిర్వహణ ఖర్చుల బిల్లులు, వాటి వినియోగంపై కూడా తనిఖీ చేయాలని కోరారు. కొనుగోలు చేసినట్లు చూపుతున్న పరికరాలు మున్సిపాలిటీలో అందుబాటులో ఉన్నాయా? వాటిని ఎక్కడ వినియోగించారు? అనే అంశాలను రికార్డుల ఆధారంగా నిర్ధారించాలని అన్నారు. జగిత్యాల మున్సిపాలిటీలో బయోమైనింగ్ పనుల కోసం థర్డ్ పార్టీ సంస్థకు సుమారు రూ.2.20 కోట్లు చెల్లించినట్లు జయశ్రీ పేర్కొన్నారు. ఇందులో ఒకసారి రూ.కోటి, మరోసారి రూ.1.20 కోట్లు చెల్లించారని తెలిపారు. అయితే పనులకు సంబంధించిన రికార్డులు, ఫొటోలు, వీడియోలు, బయోమైనింగ్ అనంతరం మిగిలిన వ్యర్థాలను ఎక్కడికి తరలించారో వివరాలు వెల్లడించడం లేదని ఆరోపించారు. బయోమైనింగ్ పనులు వాస్తవంగా నిర్వహించారా? నిర్వహిస్తే ఎంత మేరకు వ్యర్థాలను శుద్ధి చేశారు? మిగిలిన వ్యర్థాలను ఎక్కడికి తరలించారు? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. అక్కడ పనిచేసిన కొందరు కార్మికులు, డ్రైవర్ల ద్వారా తమకు అందిన సమాచారం ప్రకారం, చెత్త కుప్పలను బ్లేడ్ ట్రాక్టర్లు, జేసీబీలతో చదును చేసి, వాటిపై మొరం పోసినట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. ఈ ఆరోపణలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని డిమాండ్ చేశారు. బయోమైనింగ్ పనులకు సంబంధించిన ఒప్పందాలు, బిల్లులు, కొలతల పుస్తకాలు, చెల్లింపుల వివరాలు, పనుల పూర్తిస్థాయి ఆధారాలను పరిశీలించాలని అన్నారు. నిధుల వినియోగంలో అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. మొక్కల కొనుగోళ్లు, గ్రీన్ బడ్జెట్, మొక్కల నిర్వహణ, బయోమైనింగ్ పనులకు సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలించి సమగ్ర విచారణ చేపట్టాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ కమిషనర్‌ను అనుమల్ల జయశ్రీ కోరారు. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన సొమ్ము దుర్వినియోగం కాకుండా చూడాలని, విచారణలో ఆరోపణలు నిర్ధారణ అయితే సంబంధిత అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## కొత్తగట్టులో... ఎంగిలిపూల బతుకమ్మ సందడి



**-పెద్ద ఎత్తున హాజరైన మహిళలు**

చురకలు ప్రతినిధి హుజూరాబాద్ అక్టోబర్ 10 : సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ మత్స్య గిరింద్రుడు కొలువున్న కొత్తగట్టు గ్రామంలో మొదటిరోజు బతుకమ్మ వేడుకలు అంబరాన్ని దాకాయి. స్థానిక హనుమాన్ దేవాలయం వద్ద మొదటి రోజు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మహిళల బతుకమ్మ ఆటపాటలు కోలాటం అందరినీ కట్టిపడేసాయి. మహిళలు రంగురంగు పూలతో బతుకమ్మలను తీర్చిదిద్ది భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. రంగురంగు బంతి చామంతి పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మలు అందరినీ ఆకట్టుకున్నాయి. చిన్నారుల ఆటపాటలతో కొత్తగట్టులో బతుకమ్మ సందడి ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోకిరాల కిషన్ రావు, పురుషోత్తం రావు.పూదరి నరేష్, సిరువంచ అరుణ్, పూదరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పోతరాజు సమ్మయ్య జన్మదిన వేడుకలు





చురకలు ప్రతినిధి,మంథని, అక్టోబర్ 10 : మంథని ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి, సీనియర్ జర్నలిస్ట్ పోతరాజు సమ్మయ్య జన్మదిన వేడుకలు శనివారం మంథని ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, సభ్యులు సమ్మయ్యను శాలువాతో సన్మానించి కేక్ కట్ చేయించారు. అనంతరం పలువురు జర్నలిస్టులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రెస్ క్లబ్ అభివృద్ధికి, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సమ్మయ్య చేస్తున్న కృషి అభినందనీయమని ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. నిజాయితీ గల జర్నలిస్టుగా, ప్రెస్ క్లబ్ ను ఐక్యంగా నడిపిస్తున్న తీరు అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంకరి కుమార్, ఉపాధ్యక్షులు బర్ల సంపత్, సహాయ కార్యదర్శి గంధం ఆంజనేయులు, కోశాధికారి తగరం రాజు, సీనియర్ జర్నలిస్టులు కొమురోజు మారుతి, కొమురోజు చంద్రమోహన్, అంకరి ప్రకాష్, కంది కృష్ణారెడ్డి, లక్కాకుల నాగరాజు, బాసాని సాగర్, దొరగొర్ల రవీందర్, కేసారపు రవి, బండారి సమ్మయ్య లతో సభ్యులు, వివిధ పత్రికల విలేకరులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి సల్మాన్ కృషి మరువలేనిది

**-సల్మాన్ ఆశయాలు... ఆలోచనలు ముందుకు తీసుకెళ్లాలి**

**-గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం అందించాలి**

**- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ అక్టోబర్ 10 :** మహదేవ్‌పూర్ గ్రామాభివృద్ధికి మాజీ ఉపసర్పంచ్ సల్మాన్‌ఖాన్ చేసిన కృషి మరువలేనిదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మహదేవ్‌పూర్‌లో మాజీ ఉప సర్పంచ్ సల్మాన్ ఖాన్ స్మారకార్థంగా ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సల్మాన్‌ఖాన్ ఈనాడు మన మధ్యలో లేకపోవడం బాధాకరమని, ఇలాంటి కార్యక్రమం నిర్వహిస్తామని ఏనాడు ఊహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాటలు చెప్పడం కాదు చేయడం ముఖ్యమని అనేక విషయాల్లో గొప్ప సందేశం ఇచ్చాడని గుర్తు చేశారు. ఈనాడు సర్పంచ్‌లకు ఉపసర్పంచ్‌లకు అనేక బేధాభిప్రాయాలు ఉంటున్న తరుణంలో మహదేవ్‌పూర్ సర్పంచ్ నిర్ణయానికి ఉపసర్పంచ్‌గా సల్మాన్ కట్టుబడి పనిచేశారని ఆయన అన్నారు. నమ్మకం, ధైర్యం,ఉత్సాహం సల్మాన్‌లో కన్పించేదన్నారు.సల్మాన్‌ఖాన్ స్మారకంగా నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్ మంథని,మహదేవ్‌పూర్ క్రీడాకారులకు ఉపయోగపడాలన్నారు. ఈ ప్రాంత మట్టి బిడ్డలు ఏ అవకాశం వచ్చినా ఏమీ తీసిపోరని,త్రోబాల్‌లో పలిమెల మండలానికి చెందిన మట్టిబిడ్డ బంగారు పతకం సాధించిందన్నారు.ఎంతో మంది ప్రతిభ ఉన్న క్రీడాకారులు ప్రోత్సాహం లేక అవకాశాలు రాక ఆగిపోతున్నారని ఆయన వాపోయారు.ఈ ప్రాంతంలో చదువులు,క్రీడలకు ప్రోత్సాహం అంతగా లేదని అన్నారు.ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ క్రీడలు,చదువులకు అన్ని రంగాలకు ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు.సల్మాన్‌ఖాన్ స్మారకంగా నిర్వహించే ఈ పోటీలు ఈ ఏడాది కాకుండా ప్రతి సంవత్సరం నిర్వహించాలని,అందుకు ప్రతి ఒక్కరు సహకారం అందించాలని,అలాగే తనవంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు.గ్రామీణ క్రీడల ద్వారా క్రీడాకారులు తమ ప్రతిభను చాటి రాష్ట్ర దేశ స్థాయిలో గుర్తింపు పొందాలని ఆయన ఆకాంక్షించారు.క్రీడా నిర్వాహకులు బంధు,ప్రాంత ప్రీతి లేకుండా చూడాలని,ఒకప్పుడు మంథనిలో ఇలాంటి పరిస్థితులే ఉండేవని,కానీ తాము బంధు ప్రాంత ప్రీతికి వ్యతిరేకమని,వాటిని చేధిస్తూ గొప్పగా క్రీడలు నిర్వహించామని గుర్తు చేశారు. ఈ క్రీడలను గ్రామీణ క్రీడాకారులు క్రీడావైపుణ్యానికి ఉపయోగించుకుని గొప్ప క్రీడాకారులు గా ఎదుగాలని ఆయన ఆకాంక్షించారు.

# దేవీ నవరాత్రుల్లో శివానందలహరి ప్రవచనం

**-భక్తులు పాల్గొనాలని కోరిన గట్టు నారాయణ గురుజీ, కర్నె హరిబాబు**

**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ మంథని అక్టోబర్ 10 :** శ్రీ దేవీ శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని మంథని పట్టణంలోని తుమ్మచెరువు కట్ట వీధిలో గల శ్రీ జానకీరామ కల్యాణ వేదికలో ఈ నెల 11 నుంచి 19వ తేదీ వరకు శ్రీ శివానందలహరి ప్రవచనాలు నిర్వహించనున్నట్లు శ్రీ సీతారామ సేవాసదన వ్యవస్థాపకులు గట్టు నారాయణ గురుజీ, అధ్యక్షులు కే వి ఎల్ ఎన్ హరిబాబు తెలిపారు. బ్రహ్మశ్రీ గట్టు వామనమూర్తి గుంజపాడుగు ఆధ్వర్యంలోఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరగనున్నాయన్నారు. ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ప్రవచనాలు కొనసాగుతాయని వారు తెలిపారు. శివానందలహరిలోని ఆధ్యాత్మిక సందేశాలు, భక్తి తత్వాన్ని వివరించే ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రవచనాలను




వినాలని నిర్వాహకులు కొల్లారపు శ్రీనివాస్ కోరారు. శ్రీ సీతారామ సేవా సదన్, మంథని అధ్యక్షుడు కేవీఎల్ఎన్ హరిబాబు, సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

# సమతుల్యమైన వ్యాపారం - సంతృప్తికరమైన జీవితం

**-నేడు బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యంలో వ్యాపార వాణిజ్య వర్గాల సమావేశం**




**కరీంనగర్, అక్టోబర్ 10 :** ప్రస్తుత ఆధునిక సమాజంలో వివిధ వృత్తులలో పని చేస్తున్న వ్యక్తులు మానసిక సంఘర్షణల మధ్య జీవితాలు గడపాల్సిన పరిస్థితి ఏర్పడిందని,ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం స్థానిక సేవాకేంద్రం నిర్వాహకులు బి.కె విజయలక్ష్మి, బి కె మనీషా,ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిట్టిమల్ల శ్రీనివాస్ అన్నారు. ప్రతి వ్యక్తి మానసిక ప్రశాంతతతో ఉన్నప్పుడే ఆయా రంగాలలో వారు రాణించేందుకు వీలు కలుగుతుందన్నారు.స్థానిక కిసాన్ నగర్ లోని మైత్రి కన్వెన్షన్ లో ఆదివారం ఛాంబర్ ఆఫ్ కామర్స్ సౌజన్యంతో 'సమతుల్యమైన వ్యాపారం - సంతృప్తికరమైన జీవితం" అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్న సందర్భంగా శనివారం స్థానిక బ్రహ్మకుమారిస్ కేంద్రంలో సంబంధిత వివరాలను విలేకరులకు వెల్లడించారు.బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యంలోని రాజయోగ ఫౌండేషన్ ద్వారా వివిధ వృత్తులలో ఉన్న వారికిమానసిక ఒత్తిళ్లను తగ్గించుకొనే కార్యక్రమాలు అనేకం నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.అందులో భాగంగానే కరీంనగర్ పట్టణంలోని వ్యాపార, వాణిజ్య వర్గాల వారికోసం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశం మధ్యాహ్నం 2.30 గంటల వరకు జరుగుతుందన్నారు."వ్యాపారం లో విజయం మరియు సంతృప్తికరమైన జీవితం " రెండు కలిసి ఎదగ గలవా? అనే అంశంపై బిజినెస్ వింగ్ నేషనల్ కోఆర్డినేటర్ బ్రహ్మకుమారి దీప వ్యాపార వాణిజ వర్గాలకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. స్థానిక శాసనసభ్యులు గంగుల కమలాకర్, మేయర్ కోలగాని శ్రీనివాస్ ఈ కార్యక్రమంలో పాల్గొని మార్గ దర్శనం చేయనున్నారని తెలిపారు.

## అన్నప్రసాద వితరణకు ఏడాది పూర్తి



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 10 :** అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సేవా సమితి వ్యవస్థాపకులు రాజు దేశ్‌పాండే ఆదేశాల మేరకు ప్రతి అమావాస్య రోజున రాజన్న సిరిసిల్ల జిల్లాతో పాటు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో స్థానిక అయ్యప్ప మాలధారులు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.ఈ సేవా కార్యక్రమం శనివారం నాటికి ఏడాది పూర్తి చేసుకుంది.ఈ కార్యక్రమంలో భాగంగా గరిపెల్లి అశోక్ మాతృమూర్తి కీర్తిశేషులు శ్రీ సరోజన అమ్మ జ్ఞాపకార్థం అన్న ప్రసాధం వితరణ చేయడం జరిగింది.ఈ సందర్భంగా అయ్యప్ప మాలధారులు గురుస్వాములు పందిర్ల శ్రీనివాస్‌గౌడ్ చకిలం మదుగుప్తా కందుకూరి రవీందర్ శ్రీరామోజు శేఖర్‌లు మాట్లాడుతూ,ఆకలితో ఉన్నవారికి అన్నదానం చేయడం ఎంతో పుణ్యకార్యమని,సేవాభావంతో ప్రతి అమావాస్య రోజున అన్నప్రసాద వితరణ కొనసాగిస్తున్నామని తెలిపారు.భవిష్యత్తులోనూ ఈ సేవా కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాల దారులు బాపు రెడ్డి,రాజు గుప్తా,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు



**చురకలు ప్రతినిధి, ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 10 :** ఎల్లారెడ్డిపేటలో 'ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు' ఘనంగా ప్రారంభం అయ్యాయి. తొలిరోజు వేడుకల్లో భాగంగా తంగేడు, గునుగు, బంతి,పట్నం బంతి, పట్టుకుచ్చు,తామర పువ్వు, గుమ్మడి పువ్వులతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో వివిధ దేవాలయాల ఎదుట గ్రామ ప్రధాన కూడలిలలో మహిళలు నూతన వస్త్రాలు ధరించి ఎంతో సంబరంగా ఒకచోట చేరి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో,,,,బంగారు బతుకమ్మ ఉయ్యాలో,,,,,,అంటూ 'ఒక్కేసి పువ్వేసి సందమామ ఒక్క జాములో సందమామ..., 'చిత్తు చిత్తూల బొమ్మ శివుని ముద్దుల గుమ్మ..అందాల బొమ్మ దొరికెనమ్మో ఈ వాడలోన' అంటూ బతుకమ్మ పాటలతో హోరెత్తించారు.తొలిరోజు ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు ముగిసిన అనంతరం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గిద్ద చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.అనంతరం అక్కడ మహిళలు ఒకరినొకరు పిండివంటలను తీపివంటలను వాయినాలుగా ఇచ్చి పుచ్చుకున్నారు.

## గ్రామ గ్రామాన ఎంగిలిపూల బతుకమ్మ



**చురకలు ప్రతినిధి,కమాన్‌పూర్ అక్టోబర్ 10 :** కమాన్‌పూర్ మండలంలో గ్రామ గ్రామాన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ఘనంగా శనివారం జరిగాయి.తెలంగాణలోనే అతి పండుగలో ముఖ్యమైనది బతుకమ్మ వేడుకలు. ఈ వేడుకలుమండల కేంద్రంతో పాటు గుండారం జూలపల్లి పేరా పల్లి రొంపి కుంట నాగారం పెంచికలపేట సిద్ది పల్లె, కిష్టం పల్లె రాజాపూర్ లింగాల గొల్లపల్లి తదితర గ్రామాల్లో ఎంగిలిపూల బతుకమ్మలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండే రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆయా గ్రామాల్లోని చావళ్ల వద్ద బతుకమ్మలను పెట్టి పూజలు నిర్వహించారు.అనంతరం తెలంగాణ యాసలో బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడారు.ఈ వేడుకల్లో ప్రస్తుత సర్పంచులు పల్లె మాధవి,బంగారు కళ్యాణి,పోల్ దాసరి వనిత, తో పాటు మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారు.తొమ్మిది రోజులపాటు బతుకమ్మల అనంతరం సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నారు.

## నాణ్యమైన దర్యాప్తు.. నేరస్తులకు శిక్షలే లక్ష్యం : ఎస్పీ




**చురకలు ప్రతినిధి, నిర్మల్, అక్టోబర్,10 :** పెండింగ్ కేసుల త్వరిత పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలనీ జిల్లా ఎస్పీ.జానకి షర్మిల తెలిపారు. రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ ఆదేశాల మేరకు నిర్మల్ జిల్లా ఎస్పీ.జానకి షర్మిల పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి పక్కా ఆధారాలతో చార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. కోర్టు విచారణలను వేగవంతం చేసి నేరస్తులకు శిక్షలు పడేలా దర్యాప్తు అధికారులు, కోర్టు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. సిసిటీఎన్ఎస్ లో కేసుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసు అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించి పోలీసు శాఖపై నమ్మకాన్ని మరింత పెంపొందించాలని ఎస్పీ పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డీఎస్పీ పి.శ్రీనివాస్, సీఐలు, ఎస్‌హెచ్‌ఓలు, సీడీఓలు, సీసీటీఎన్ఎస్ రైటర్లు, టెక్ టీమ్ సభ్యులు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## చెరువులో మునిగి యువకుడి మృతి

**-మృతదేహం వెలికితీసిన**

**17వ బెటాలియన్ ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందికి ప్రశంసలు**

**-వెంకటాపూర్లో విషాదం**




**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 10 :** చేపలు, తాబేళ్లు పట్టేందుకు స్నేహితులతో కలిసి చెరువులోకి వెళ్లిన ఓ యువకుడు నీటమునిగి ప్రాణాలు కోల్పోయిన విషాదకర ఘటన ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులో జరిగింది.వెంకటాపురం గ్రామానికి చెందిన మోతే ఎల్లయ్య, ఎల్లవ్వ దంపతుల కుమారుడు మోతే కిరణ్.. స్నేహితులతో కలిసి చెరువులోకి దిగాడు. ఈ క్రమంలో లోతైన ప్రాంతానికి వెళ్లి నీటమునిగాడు. నిన్న గాలింపు చేపట్టినా ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం మోతె కిరణ్ మృతదేహాన్ని సిఐఓ వెంకటేష్ ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు 17వ ఐఆర్ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ పి సి జె పి చటర్జీ అసిస్టెంట్ సిఎంటి రాందాస్ ఇంచార్జ్ శ్రీనివాస్ హఇంచార్జ్ ఆర్ ఎస్ ఐ శేఖర్ ఆదేశాల మేరకు సర్దాపూర్ 17వ బెటాలియన్ డి.ఎస్.పి రాందాస్ ఆధ్వర్యంలో ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది, చాకచక్యంగా వెలికితీశారు.గంటల వ్యవధిలోనే ఆపరేషన్ పూర్తి.చేసి ఎస్డిఆర్ఫ్ బృందం సాహసానికి అధికారులు అభినందనలు తెలిపారు, క్లిష్టమైన సమయంలో వేగంగా స్పందించి, ఎంతో బాధ్యతాయుతంగా రెస్క్యూ ఆపరేషన్ పూర్తి చేసిన డి.ఎస్.పి రాందాస్ ఆర్ఎస్ఐ శేఖర్ బృందం పనితీరును ఉన్నతాధికారులు కొనియాడారు. విధి నిర్వహణలో సిబ్బంది ప్రదర్శించిన అంకితభావాన్ని ప్రశంసిస్తూ, ఇలాంటి సంసిద్ధత ఎంతో ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న సర్కిల్ ఇన్స్పెక్టర్ ఓ వెంకటేష్ హుటాహుటిన హైదరాబాద్ నుండి ఎస్సై రమేష్ స్టేషన్ నుండి ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.కిరణ్‌కు భార్య, ముగ్గురు చిన్నపిల్లలు ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న కిరణ్ మృతితో భార్యాపిల్లలు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది.

# మహమ్మద్ ప్రవక్త జీవితాన్ని విధిగా ప్రతిఒక్కరూ చదవాలి

**-ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్, ముఫ్తి యునూస్ ఖాస్మి పిలుపు**

**-సీరతున్నబి టాలెంట్ టెస్టులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు**



**హుజురాబాద్,అక్టోబర్ 10 :** మహనీయ మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ విధిగా అధ్యయనం చేసి చదవాలని అనునిత్యం మహమ్మద్ ప్రవక్త చూపిన బాటలో నడవాలని ప్రవక్త సూచనలను పాటించాలని మజిలీస్ తహఫూజ్ ఖత్మే నబువ్వత్ రిలీజియస్ ట్రస్ట్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్ అధ్యక్షతన, ముస్లిం సమాజానికి పిలుపునిచ్చారు. శనివారం హుజురాబాద్ పట్టణంలో సిటీ ఫంక్షన్ హాల్ లో జమియతుల్ ఉలేమా హుజురాబాద్ అధ్యక్షుడు హాఫిజ్ ఇమ్రాన్ బేగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీరతున్నబి టాలెంట్ టెస్టు పరీక్షలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక సదస్సులో ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్, ముఖ్యఅతిథిగా ముఫ్తి యునూస్ ఖాస్మి, ముఫ్తి సాధిఖ్ హుస్సేన్ ఖాస్మి మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే ప్రవక్త జీవితాన్ని పూర్తిగా చదవాలని, సమాజంలో నేడు పట్టి పీడిస్తున్న సామాజిక రుగ్మతలను పారద్రోలేందుకు సమాజ స్థితిగతులను చెడు మార్గం నుంచి మంచి మార్గం వైపు తీసుకెళ్లేందుకు ప్రవక్త జీవితం దోహదపడుతుందన్నారు. ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్, హుజురాబాద్ మస్జిద్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ ముజాహిదీన్ హుస్సేన్,ముఫ్తి యునూస్ ఖాస్మి చేతుల మీదుగా బహుమతులను ప్రధానం చేశారు. ఈకార్యక్రమంలో హాఫీజ్ రిజ్వాన్,మౌలానా షేఖ్ నయిమ్, ముఫ్తి షాకిర్, మౌలాన సోహైల్, హాఫిజ్ ఇమ్రాన్ బేగ్, మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్, ముఫ్తి అమీర్ బాబా,అశు ,ఆమెర్ తదితరులు పాల్గొన్నారు.



# విజయవాడ కనకదుర్గమ్మకు చేనేత పట్టుచీరల సమర్పణ

**చురకలు ప్రతినిధి కరీంనగర్, అక్టోబర్ 10 :** అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షులు కందగట్ల స్వామి నేతృత్వంలో, విజయవాడ శ్రీ కనకదుర్గ దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు జి.వి. నాగేశ్వరరావు,శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి చేనేత వస్త్రాల సమర్పణ శని వారం ఘనంగా నిర్వహించారు తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షులు, కరీంనగర్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు మెతుకు సత్యం సారథ్యంలో 10 రోజులకు గాను 10 చేతులతో నేసిన పట్టు చీరలను అమ్మవారికి సమర్పించారు. చేనేత కళాకారుల చేతి నైపుణ్యంతో తయారైన ఈ చీరలను ఆలయ అర్చకులు అమ్మ వారికి అలంకరించనున్నట్లు మెతుకు సత్యం తెలిపారు.చేనేత వస్త్రాలకు పుట్టినిల్లు పద్మశాలి కులస్తుల ఆధ్వర్యం లో ప్రతి ఏటా అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ సాంప్రదాయాన్ని చాలా సంవత్సరాలుగా పూర్వీకుల నుండి కొనసాగిస్తున్నామని మెతుకు సత్యం తెలిపారు.ఈ కార్యక్రమంలో అఖిలభారత పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం,వనం విశ్వనాథం, దుష్యంతల,బొళ్ల శివశంకర్, రాపోలు సుధాకర్,బొద్దుల లక్ష్మణ్,గుర్రం శ్రావణ్ కుమార్,గుంటక రూప,మెతుకు మంజుల రాణి,పోరండ్ల శారద, నోముల రేఖ,చిన్నకోట్ల స్వప్న,గుర్రం విశ్వేశ్వర్ రావు,కర్నాటి విజయ్, కైరంకొండ ఉదయ్,మెతుకు వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



### పోలీస్ ఫ్లాగ్ డే-2026 సందర్భంగా

# వ్యాసరచన, లఘు చిత్రాలు, ఫోటోగ్రఫీ పోటీలు

**-పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 10 :** అక్టోబర్ 21న నిర్వహించనున్న పోలీస్ ఫ్లాగ్ డే-2026ను పురస్కరించుకుని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యాసరచన, లఘు చిత్రాలు,ఫోటోగ్రఫీ పోటీల్లో విద్యార్థులు, యువత, పోలీసు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొనాలని కరీంనగర్ సిపి గౌష్ ఆలం,ఐపీఎస్ పిలుపు నిచ్చారు.పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో చేస్తున్న త్యాగాలు, ప్రజల భద్రత కోసం అందిస్తున్న సేవలు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్రపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశమని కమిషనర్ తెలిపారు.

**వ్యాసరచన పోటీలు:**

12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు తెలుగు,ఉర్దూ,ఆంగ్ల భాషల్లో పోలీస్‌స్టేషన్ స్థాయిలో వ్యాస రచన పోటీలు నిర్వహించనున్నారు. వీటికి సంబంధించిన అంశాలు:

**సైబర్ నేరాల నివారణలో పోలీసులు, పౌరుల పాత్ర.**

- మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసుల పాత్ర.
- విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలు.

**డిగ్రీ,ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ఈ క్రింది అంశాలపై పోటీలు నిర్వహిస్తారు:**

- సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసుల పాత్ర. తెలంగాణను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చడంలో నా పాత్ర.

**లఘు చిత్రాల పోటీలు:**

పోలీసుల సేవలు, త్యాగాలు, ప్రజా భద్రత,సైబర్ నేరాల నివారణ,మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా తెలుగు, ఉర్దూ లేదా ఆంగ్ల భాషల్లో గరిష్ఠంగా మూడు నిమిషాల నిడివి గల లఘు చిత్రాలను రూపొందించవచ్చు. యూనిట్ స్థాయిలో ఎంపికైన ఉత్తమ మూడు లఘు చిత్రాలను రాష్ట్రస్థాయి పరిశీలనకు పంపించి, విజేతలకు ప్రతిభా ధ్రువపత్రాలు అందజేస్తారు.

**ఫోటోగ్రఫీ పోటీలు:**

పోలీసుల విధులు, సేవలు, ప్రజా భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నిర్వహణ,పోలీసు-ప్రజల సంబంధాలు, విధి నిర్వహణలో ఉన్న పోలీసు సిబ్బంది తదితర అంశాలపై ఫోటోగ్రఫీ పోటీలు నిర్వహించనున్నారు. ఫోటోలు ఇటీవల తీసినవై ఉండటంతో పాటు పోలీసు విధులకు నేరుగా సంబంధించినవై ఉండాలి. యూనిట్ స్థాయిలో ఎంపికైన ఉత్తమ ఫోటోలను రాష్ట్రస్థాయి పరిశీలనకు పంపించి, ఎంపికైన ఫోటోగ్రాఫర్లకు ప్రతిభా ధ్రువపత్రాలు అందజేస్తారు.

**ఎంట్రీల సమర్పణ:**

లఘు చిత్రాలు, ఫోటోగ్రఫీ పోటీల్లో పాల్గొనేవారు తమ ఎంట్రీలను సంబంధిత పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ల ద్వారా ఈ నెల 20వ తేదీలోగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ కార్యాలయానికి పంపించాలి. విద్యార్థులు,యువత,ఫోటోగ్రఫీ అభిరుచి కలిగినవారు,పోలీసు సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను చాటడంతో పాటు సమాజంలో అవగాహన పెంపొందించే సందేశాలను సృజనాత్మకంగా అందించాలని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ కోరారు.

# అన్యాక్రాంతమైన వక్ఫ్ భూములను స్వాధీనం చేసుకోండి

**-మైనారిటీ బడ్జెట్‌ను ఆచరణలో సక్రమంగా అమలు పరచండి**
**-ఉమ్మడి జిల్లాలో మైనారిటీల సమస్యలను పరిష్కరించాలి**
**-రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ కు.. ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు గులాం అహ్మద్ వినతి**



**కరీంనగర్, అక్టోబర్ 10 :** కరీంనగర్ జిల్లాలో అన్యాక్రాంతమైన వందలాది ఎకరాల వక్ఫ్ బోర్డు భూములను గుర్తించి స్వాధీనం చేసుకోవాలని, ఉమ్మడి జిల్లాలలో ముస్లిం మైనారిటీలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరుతూ..ఎంఐఎం కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్‌ను,శనివారం హైదరాబాద్ లోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు మంత్రి అజారుద్దీన్‌ను కలిసినట్లు తెలిపారు. వక్ఫ్ బోర్డు చైర్మన్‌తో కలిసి, కరీంనగర్ కు రండి,కబ్జాకు గురైన వక్ఫ్ భూముల ను మేము చూపిస్తామని చెప్పారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాల్లో గ్రామ పంచాయతీలలో మస్జిదుల నిర్మాణా లకు,ఆయా గ్రామాల సర్పంచులు అనుమతులు ఇవ్వడం లేదని, వివిధ కుంటి సాకులు చెబుతూ పెండింగులో పెడుతున్నారని, దీనితో ముస్లింలు దీంతో ఇబ్బందులు పడుతున్నారని, మస్జిదుల నిర్మాణం కోసం ఇబ్బందులు జరగకుండా జిల్లా కలెక్టర్లతో సమీక్షించి, ఇబ్బందులను తొలగించాలని చెప్పారు.ప్రతి 6నెలలకు ఒకసారి మైనారిటీ సంక్షేమ పథకాల అమలుపై, కలెక్టర్ అధ్యక్షతన రివ్యూ మీటింగ్ నిర్వహించేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు.కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న పట్టణాలు, మండలాలు,డివిజన్ కేంద్రాలలో ఖబరస్థాన్,ఈద్గాలకు స్థలాలను కేటాయించాలన్నారు. స్వాతంత్రం వచ్చాక అప్పటి ప్రభుత్వాలు కేటాయించిన స్థలాలు తప్ప, గత 2దశాబ్దాలలో ఈద్గాలకు ఖబ్రస్తాన్లకు స్థలాలు కేటాయించిన దాఖలాలు తక్కువగా ఉన్నాయన్నారు. మైనారిటీ సంక్షేమ శాఖకు పెద్ద ఎత్తున బడ్జెట్‌ను కేటాయిస్తున్నప్పటికీ,కేవలం కాగితాల్లోనే వేలకోట్ల బడ్జెట్ కేటాయించినట్లు చూపిస్తున్నారు.. తప్ప ఆచరణలో అమలు చేయడం లేదన్నారు. నిధులు ల్యాప్స్ అయి, ప్రభుత్వానికి తిరిగి ఖాతాలో జమ అవుతున్నాయన్నారు. మైనారిటీ బడ్జెట్ తో కేవలం మైనార్టీ గురుకులాలు తప్ప, సంక్షేమ పథకాలు సక్రమంగా కొనసాగడం లేదన్నారు. మైనారిటీ సంక్షేమ పథకాలకు సంబంధించి స్కాలర్షిప్స్, ఓవర్సీస్ స్కీమ్,ఫీజు రియంబర్స్మెంట్‌లకు సంబంధించి నిధులు విడుదల చేయాలన్నారు.ఫీజు రీయింబర్స్మెంట్ లేక ఉన్నత విద్యను అభ్యసిస్తున్న అటువంటి విద్యార్థు లందరూ తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నారని వివరించారు. సబ్సిడీ లోన్లు, కుట్టు మిషన్లు,డ్రైవర్ కం ఓనర్ పథకాలకు యూనిట్లను పెంచాలన్నారు. ముస్లిం సంచార జాతులకు, చేతివృత్తుల వారికి పనిముట్లు,ద్విచక్ర వాహనాలను సబ్సిడీపై ఎక్కువ యూనిట్లను అందించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.ఇందుకు సంబంధించి ఇటీవలే కరీంనగర్ జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేసినట్లు మంత్రి అజారుద్దీన్ కు, గులాం అహ్మద్ తెలిపారు.

## పితృ అమావాస్య సందర్భంగా

# శివపరాశక్తి పీఠంలో విశేష పూజలు

**-శివనామస్మరణతో మారుమోగిన పీఠం..**
**-భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 10 :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లోని శివపరాశక్తి పీఠం పితృ అమావాస్య సందర్భంగా శివనామ స్మరణతో మారుమోగింది.ఈ పర్వ దినాన్ని పురస్కరించుకుని పీఠంలో పరమశివునికి భక్తిశ్రద్ధలతో విశేష పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం, భస్మ విభూతి అభిషేకం,ప్రత్యేక అన్నాభిషేకం తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు,ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.శివనామస్మరణతో పీఠం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.పూజా కార్యక్రమాల అనంతరం స్వామివారికి సమర్పించిన సప్తహారతులు భక్తులను భక్తిపారవశ్యం లో ముంచెత్తాయి. అనంతరం పీఠం ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు శివపరాశక్తి పీఠాధిపతి పరమపూజ్య శ్రీశ్రీ మనోహర్ రాజు గురూజీ ఆశీస్సులు అందజేశారు. పితృ అమావాస్య పర్వదినాన నిర్వహించిన ప్రత్యేక పూజలు, అభిషేకాలతో పీఠం భక్తజన సందోహంతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

# మదర్సా అరబియా హిఫ్జుల్ ఖురాన్ విద్యార్థులకు బహుమతులు పంపిణీ

**-ముఫ్తి ఖియాస్ మొహియుద్దీన్**



**కరీంనగర్,అక్టోబర్ 10 :** దివ్యగ్రంథము ఖురాన్ ను ప్రతి ఒక్క ముస్లిం విధిగా అధ్యయనం చేసి చదవాలని అనునిత్యం మహమ్మద్ ప్రవక్త చూపిన బాటలో నడవాలని, మదర్సా అరబియా హిఫ్జుల్ ఖురాన్ నాజీమ్ మదర్సా, మజిలీస్ తహఫూజ్ ఖత్మే నబువ్వత్ రిలీజియస్ ట్రస్ట్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ముఫ్తి ఖియాస్ మొహియుద్దీన్, విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. శుక్రవారం రేకుర్తి మదర్సా అరబియా హిఫ్జుల్ ఖురాన్ లో ఆరునెలల ఖురాన్ పఠనం పరీక్షలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. మదర్సాలో ఉన్నంత కాలం ఏ విధంగానైతే జీవితం పాబందీగా గడుపుతారో,అదే విధంగా సెలవులు వచ్చినప్పుడు ఇంటికి వెళ్లి తల్లిదండ్రుల తో, ఇరుగుపొరుగు వారితో మర్యాదగా నడుచుకోవాలని, క్రమం తప్పకుండా ఐదు పూటల నమాజ్ ఆచరించాలని, ఇస్లామీయ సాంప్రదాయ దుస్తులను ధరించాలని, చెడు పనులతో, చెడు వ్యక్తులతో, దూరంగా ఉండాలని చెప్పారు. ముఖ్యంగా సెల్ఫోన్ అవసరానికి మించి వాడొద్దన్నారు. ఆన్లైన్ గేమింగ్ ఆడకుండా చిన్నారులపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని కోరారు. సెల్ఫోన్తో లాభాలతో పాటు చాలావరకు ఎక్కువగా నష్టాలు ఉన్నాయని ప్రతి ఒక్కరు గ్రహించాల న్నారు.పలు అంశాలపై విద్యార్థులకు హితోపదేశం చేశారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు హాఫిజ్ షేక్ అహ్మద్ హిఫ్జి, షేక్ ఫరీదోద్దిన్, షేక్ ఫజల్, సాజిద్ అన్సారీ, మజహర్, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

# ఎస్ఆర్ బాలికల కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**చురకలు ప్రతినిధి,నిర్మల్, అక్టోబర్, 10 :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని నిర్మల్‌లోని ఎస్ఆర్ గర్ల్స్ జూనియర్ కాలేజ్ ఐఐటీ, జేఈఈ, నీట్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం కళాశాల ప్రాంగణంలో ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి కళాశాలకు హాజరయ్యారు. వివిధ రకాల రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ చేరి బతుకమ్మ పాటలు పాడుతూ సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. విద్యార్థినుల ఉత్సాహం, అందంగా అలంకరించిన బతుకమ్మలతో కళాశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్.ఆర్. ఇన్స్టిట్యూషన్ డీజీఎం.గోవర్ధన్ రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి నాగేశ్ యాదవ్, అకడమిక్ డీన్ రాంబాబు,కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్ రెడ్డి పాల్గొని విద్యార్థినులను అభినందించారు.అనంతరం వారు మాట్లాడుతూ,బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు,ప్రకృతి ప్రేమకు,మన సంస్కృతి సంప్రదాయాల వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.విద్యార్థినులు ఆధునిక విద్యలో రాణించడంతో పాటు, మన సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూ వాటి గొప్పతనాన్ని భావితరాలకు అందించాలని సూచించారు.కళాశాల అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థినులతో కలిసి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినుల సందడి,బతుకమ్మ పాటలు,నృత్యాలు ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ కార్యక్రమం విద్యార్థినుల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహనను,గౌరవభావాన్ని పెంపొందించింది.

# జాతీయ స్థాయి చిత్రకళా విజేత శ్రీనిత్యకు అభినందన

**-దారం సుశీల మెమోరియల్ ట్రస్ట్ ప్రోత్సాహం**



**చురకలు ప్రతినిధి కరీంనగర్,అక్టోబర్ 10 :** ఇటీవల జరిగిన జాతీయ స్థాయి చిత్రకళ పోటీలలో ప్రథమ బహుమతి పొందిన శ్రీ నిత్యను అభినందించిన డాక్టర్ డి రఘురామన్ స్థానిక ఖార్ఖానగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థిని దేవరకొండ శ్రీనిత్య చెప్పకుర్తి ఆర్ట్స్ ఫౌండేషన్ వారు ఆన్లైన్లో నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రకళా పోటీల్లో వివిధ రాష్ట్రాల నుండి 200 మంది చిత్ర కళాకారులు పాల్గొన్న పోటీలలో శ్రీ నిత్య పెన్సిల్ ఆర్ట్‌తో రూపొందించిన గణేశుని చిత్రానికి ప్రథమ బహుమతి సాధించింది.విద్యార్థిని ప్రతిభను గుర్తించిన డాక్టర్ డి. రఘురామన్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ చారి,ఉపాధ్యాయులు నంది శ్రీనివాస్‌లను సంప్రదించి,దారం సుశీల మెమోరియల్‌ట్రస్ట్ తరపున పాఠశాలను సందర్శించి శ్రీనిత్యకు చిత్రకళలో మరింత ప్రావీణ్యం సాధించేందుకు అవసరమైన చిత్రలేఖన సామగ్రిని ఉపాధ్యాయ బృందం సమక్షంలో దారం సుశీల ట్రస్ట్ తరపున అందజేసి ప్రోత్సహించారు.డాక్టర్ రఘురామన్ శ్రీనిత్య ప్రతిభను,ఆమెకు అండగా నిలిచిన తల్లిదండ్రులను, మార్గదర్శకత్వం అందించిన ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.భవిష్యత్తులోనూ ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించేందుకు దారం సుశీల మెమోరియల్‌ట్రస్ట్ ఎల్లప్పుడూ ముందుంటుందని,విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడటం తమకు సంతోషకరమని తెలిపారు.

# త్వరలోనే మౌలిక వసతులు కల్పిస్తాం

**-జగిత్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలను సందర్శించిన మంత్రి అడ్లూరి**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 10 :** జగిత్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నిర్మాణ పనులు, మౌలిక వసతుల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు.గత రెండు రోజుల క్రితం కళాశాల నిర్మాణ పనులు, మౌలిక వసతులు సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విద్యార్థులతో ఫోన్లో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని వారికి హామీ ఇచ్చారు.ఈ క్రమంలో రాష్ట్ర రోడ్లు,భవనాలశాఖ మంత్రి,వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి విద్యార్థుల సమస్యలను తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రులు,విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి మెడికల్ కళాశాలను త్వరలోనే అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.విద్యార్థులతో ఫోన్లో మాట్లాడిన సందర్భంగా స్వయంగా కళాశాలకు వచ్చి వారితో సమావేశమై సమస్యలను తెలుసుకుంటానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం శనివారం జగిత్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలను సందర్శించి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు.వారి సమస్యలను, కళాశాలలో నెలకొన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని,వారి సమస్యలను సంబంధిత మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

# ప్రాచీన శిల్పకళకు ప్రతిరూపం శివాలయం

**-శరన్నవరాత్రులకు సిద్ధమైన రామలింగేశ్వర ఆలయం**

**-అక్టోబర్ 11 నుండి దేవస్థానంలో ఉత్సవాలు**



**రామ కిష్టయ్య సంగన భట్ల...**

సుప్రసిద్ధ ప్రాచీన పవిత్ర గోదావరీ తీరస్థ తీర్థంగా, పుణ్య క్షేత్రంగా మిగుల ప్రాచుర్యం పొందింది జగిత్యాల జిల్లా లోని ధర్మపురి క్షేత్రం. శ్రీలక్ష్మీనరసింహ, శ్రీరామ లింగేశ్వరస్వాముల దేవాలయాలు, మసీదూ పక్కపక్కనే కలిగి అనాదిగా వైష్ణవ, శైవ, ముస్లిం మత సామరస్యానికి సాక్షీభూతంగా నిలిచియున్న ధర్మపురి క్షేత్రం రాజం. గంభీర గౌతమీనదీ తీరాన వెలసి, అలనాటి శిల్పకళా చాతుర్యానికి ప్రతిబింబమై, ఐతిహాసిక, చారిత్రిక ప్రాధాన్యతను సంతరించుకుని దక్షిణ కాశిగా పేరెన్నిక గనుటకు మూలకారణమైనది ఈక్షేత్రం లోని శ్రీరామచంద్ర స్థాపిత శ్రీరామ లింగేశ్వరాలయం. అక్టోబర్ 11నుండి అక్టోబర్ 20 వరకు నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాలకు దేవస్థానం పక్షాన రామలింగేశ్వర తత్సంబంధిత ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. భృగుమహర్షి త్రిమూర్తులను పరీక్షించిన నేపథ్యంలో, కైలాస మేగిన సందర్భంలో నిత్యానందంలో మునిగి తేలుతూ ఆ మహర్షి రాకను గమనింపని పార్వతీ పరమేశ్వరులను గాంచిన భృగు మహర్షి, శివుడు లింగ రూపులో ఉంటూ, ఎవరిచేతా పూజింప బడకుండునట్లు శాపమిచ్చెనని పురాణాలు విశదీకరిస్తున్నాయి. తన శాప విముక్తికై పరమ శివుడు, మహా విష్ణువును గురించి ఘోర తపస్సు చేయగా రామావతారంలో, ధర్మపురి క్షేత్రంలో స్వయంగా తాను లింగాన్ని ప్రతిష్ఠించి, పూజించి శాపవిమోచనం కలిగించ గలనని మహా విష్ణువు వరమిచ్చినట్లు స్థానిక పురాణాలు స్పష్ట పరుస్తు న్నాయి. రామావతారంలో దశరథుని ఆజ్ఞానుసారం వనవాస దీక్షలో, దండకారణ్యంలో సంచరిస్తూ, ధర్మపురి క్షేత్రానికి ఏతెంచిన శ్రీరాముడు అలనాటికే వెలసియున్న శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి ఈశాన్యాన సైకత (ఇసుక) లింగాన్ని ప్రతిష్ట చేసినట్లు, శ్రీరామునిచే స్థాపించ బడినందున శ్రీరామలింగేశ్వరుడని నామాంకితుడైనట్లు స్థల పురాణం స్పష్టం చేస్తున్నది. 6వ శతాబ్దంలో స్థాపించబడి, 8వ శతాబ్దాంతం వరకూ వర్ధిల్లిన చాళుక్య రాజుల ప్రాభవంలో పునర్మించబడిన రామేశ్వరాల యంలోని గణేశ విగ్ర హములు అలనాటి శిల్పకళకు అద్దం పడుతున్నాయి. క్రీ.శ.978 నుండి 1140 వరకు పాలించిన కల్యాణి చాళుక్యుల వంశానికి చెందిన విక్రమార్క బిరుదాంకి తుడగు ఆరవ విక్రముని (1076–1126) నాటి శిలాశాసనం ఈ ఆలయంలో ఉంది. ఇందులో ఈ చాళుక్య రాజు "పరమేశ్వర, రణరంగభైరవ, మార్వల భైరవ, సుగంధవారణ, విక్రమాదిత్య" బిరుదులతో ప్రశంసింప బడినాడు. శాలివాహన శకం 1168 పరాభవ నామ సంవత్సర కాలం నాటి కాకతీయ గణపతి దేవుని శిలా శాసనం రామేశ్వర ఆలయంలో పూర్వపు చాళుక్య స్థంభంపైనే చెక్కబడి ఉంది. గణపతి దేవుడు ఇచటి రామేశ్వర, చండికల అంగ రంగ వైభోగములకు గావించిన కొన్ని దానములు శాసనములలో పేర్కొన బడినవి. ఈ ఆలయంలోని మహిషాసుర మర్ధిని, దక్షిణామూర్తి, సప్తమాతృకల విగ్రహాలు కూడా చాళుక్యుల కాలం నాటివేనని, పురావస్తు శాఖలో శాసన వ్యాఖ్యాతగా పనిచేస్తూ పరమపదించిన ప్రముఖ చారిత్రక పరిశోధకులు, స్థానికులు కీర్తి శేషులు సంగనభట్ల నరహరిశర్మ పరిశోధనల ద్వారా తెలుస్తున్నది. క్రీ.శ.1309లో ఢిల్లీ నేలిన అల్లా. ఉద్దీన్ ఖిల్జీ సేనిని మాలిక్ నాయబ్ కాఫూర్, ఇందూరు (నిజా మాబాద్ మీదుగా ధర్మపురి మార్గంలో కాకతీయుల పైకి దండెత్తి వెళ్ళిన సమయంలో క్షేత్రంలోని రామేశ్వర,- నృసింహాలయాలు ధ్వంసం చేయ బడినాయి. క్రీ.శ.1332-1367 మధ్యకాలంలో తెలంగాణ లోని వెలమ వీరుల సాయంతో, ముస్లింల నుండి దాస్య విముక్తి కలిగించిన ముసునూరి కాపయా మాత్యుని పాలనా కాలంలో, పరమహంస పరివ్రాజకాచార్య నారాయణాశ్రమ స్వామి ఉభయ దేవాలయాలకు చేయూతనిచ్చి తిరిగి అర్చనాదులకై కట్టుదిట్టం చేశారు. అబుల్ హసన్ తానాషా (1674-1687) మంత్రియగు మాదోభానూజీ సూర్యప్రకాశరావు మజుందార్ (మాదన్న మంత్రి) ఉభయ ఆలయాల అర్చన సహకరించారు. నాటినుండి స్థానిక దాతలైన విప్రవరుల ఆర్యవైశ్యుల, భక్తుల సహకారంతో పూజ నైవేద్యాలు విధివిదాన కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగిస్తూ, కొంతకాలం క్రితం దేవాలయం దేవాదాయ శాఖ ఆధీనంలోనికి తీసుకోబడింది. ఫలితంగా లక్ష్మీనర సింహ దేవస్థానంలో అంతర్భాగమైంది. మాజీ రాష్ట్ర దేవాదాయ శాఖామాత్యులు జువ్వాడి రత్నాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే శికారి విశ్వనాథం, మాజీ రాష్ట్ర మంత్రి, స్థానిక మాజీ ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ చొరవతో, ప్రస్తుత మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్,వివిధ ట్రస్టుబోర్డు చైర్మన్ల నేతృత్వంలోని ధర్మకర్తల మండలుల కృషితో, దాతల చేయూతతో నిధులను ప్రోగు చేసుకుని ముఖ్యమంత్రి సర్వ శ్రేయోనిధి ద్వారా ప్రత్యేక నిధులు పొంది, దేవాలయ పునరుద్ధరణ, సాలహార నిర్మాణం, అమ్మవారు, నంది, కలశ, నవగ్రహ విగ్రహ ప్రతిష్టలు పూర్తి చేసుకుని, శృంగేరి శంకరాచార్య బహూకృత ఆదిశంకర శారదామాత మూర్తులను ఆలయంలో ప్రతిష్ఠించడం జరిగింది. ఇందారపు రామయ్య నేతృత్వంలోని దేవస్థాన పునరుద్ధరణ కమిటీ ప్రత్యేక కృషితో లక్షలాది నిధులను దాతల ద్వారా సమ కూర్చుకుని పలు మార్పులు చేర్పులతో కనీ వినీ ఎరుగని కొత్త శోభను సంతరించుకుంది.అక్టోబర్ 11 నుంచి నిర్వహించే దసరా నవరాత్రుల సందర్భంగా ఎసి, ఇఓ సంకటాల శ్రీనివాస్ నేతృత్వంలో, అర్చకులు దేవళ్ళ విశ్వనాథశర్మ, పాలెపు ప్రవీణ్ శర్మ సిబ్బంది ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు గావిస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం వలసిన వసతులు, ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, అర్రెమి నాడు సామూహిక కుంకుమా ర్చనలకు విశేష ఏర్పాట్లు చేశారు.

# ఆపదలో ఉన్నవారికి రక్తదానం

**-మానవత్వానికి ప్రతీకగా యువసేన సభ్యులు**

**-37వసారి రక్తదానం చేసిన కొత్తపల్లి సతీష్..**

**అత్యవసర సమయంలో రక్తదానం చేసిన కొమ్ము శ్రీనివాస్**





**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్, అక్టోబర్ 10 :** ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలనే సేవాభావంతో ఛత్రపతి శివాజీ యువసేన సభ్యులు ముందుకు వచ్చారు. గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు బాధితులకు అత్యవసరంగా రక్తం అవసరం కావడంతో స్పందించి రక్తదానం చేశారు. కమాన్‌పూర్ మండలం శాలపల్లి గ్రామానికి చెందిన మాటేటి మల్లమ్మ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, ఆమెకు ఓ పాజిటివ్ (ఓం) రక్తం అవసరమైంది. కుటుంబ సభ్యులు యువసేనను సంప్రదించడంతో చత్రపతి శివాజీ యువసేన ఉపాధ్యక్షుడు, సిద్ధిపల్లి ఉపసర్పంచ్ కొత్తపల్లి సతీష్ ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేశారు.ఇది ఆయనకు 37వ రక్తదానం కావడం విశేషం.అదేవిధంగా, రామగిరి మండలం చందనాపూర్ గ్రామానికి చెందిన కాటరాపు రవికి అత్యవసరంగా ఏ పాజిటివ్ (ఏం) రక్తం అవసరం కావడంతో చత్రపతి శివాజీ యువసేన మాజీ ఉపాధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్ స్పందించి రక్తదానం చేశారు.సకాలంలో స్పందించి రక్తదానం చేసిన సతీష్, శ్రీనివాస్‌లకు బాధితుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. చత్రపతి శివాజీ యువసేన అధ్యక్షుడు మల్యాల శేఖర్‌తో పాటు సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని యువసేన సభ్యులు పిలుపునిచ్చారు.

# ఎంప్లాయీస్ యూనియన్ ఐక్య కూటమి గెలుపునకు కృషి చేసిన వారికి కృతజ్ఞతలు



**చురకలు ప్రతినిధి కోరుట్ల,అక్టోబర్ 10 :** తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్-టీఎంయూ ఐక్య కూటమి గెలుపునకు సహకరించిన ఆర్టీసీ కార్మికులకు ఏఐటీయూసీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం కోరుట్ల డివిజన్ ఆర్టీసీ డిపోలో కార్మికులను కలిసిన నాయకులు వారి సహకారాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు సుతారి రాములు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు ఐక్యంగా నిలబడి తమ హక్కుల పరిరక్షణ కోసం ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం, ఉద్యోగ భద్రత, పెండింగ్ వేతన బకాయిల చెల్లింపు, ఆర్టీసీ సంస్థ పరిరక్షణ కోసం ఎంప్లాయిస్ యూనియన్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని పేర్కొన్నారు. ఆర్టీసీని ప్రైవేటీకరణ నుంచి కాపాడుతూ ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సందర్భంగా కార్మికులు స్వచ్ఛందంగా సెలవులు పెట్టి, ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటూ విస్తృత ప్రచారం నిర్వహించి ఐక్య కూటమికి మద్దతుగా నిలవడం శుభపరిణామమని తెలిపారు. కార్మికులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని సుతారి రాములు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, కవి, రచయిత, మాజీ కండక్టర్ రాస భూమయ్య, ఏఐటీయూసీ నాయకులు రామిల్ల రాంబాబు, ఎం.డి. సమీర్, కొక్కుల గంగాధర్ తదితరులు పాల్గొని ఐక్య కూటమి గెలుపునకు సహకరించిన కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు.